అన్నదాతకు అండగా..

వేములవాడ: రైతు దీక్షలో పాల్గొని నినదిస్తున్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, జడ్పీ, మున్సిపల్ చైర్‌పర్సన్లు అరుణ, మాధవి, నాయకులు

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతుదీక్ష
- ₹2లక్షల పంట రుణమాఫీ వెంటనే అమలు చేయాలి
- ఎండిన పంటలకు ₹25వేల నష్టపరిహారం ఇవ్వాలి
- పంటలకు ₹500బోనస్ ప్రకటించాలని డిమాండ్
- వేములవాడ నియోజకవర్గ స్థాయి దీక్షకు హాజరైన ఇన్‌చార్జి చల్మెడ, ముఖ్య నాయకులు

అసెంబ్లీ ఎన్నికల సమయంలో అన్నదాతలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం నియోజకవర్గ స్థాయిలో రైతుదీక్షలు చేపట్టారు. వేములవాడ పట్టణంలో నిర్వహించిన రైతుదీక్షకు బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు వెంటనే ₹2లక్షల పంట రుణమాఫీ అమలు చేయాలని, సాగునీరందక ఎండిపోయిన పంటలకు ఎకరానికి ₹25వేల నష్టపరిహారం ఇవ్వాలని, వరి పంటకు క్వింటాల్‌కు ₹500బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేసేంతవరకు అన్నదాతలకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.

– వేములవాడ, ఏప్రిల్ 6

కాంగ్రెస్ సర్కారు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేసేవరకు రైతుల పక్షాన కొట్లాడుతామని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు వేములవాడ పట్టణంలోని చల్మెడ నివాసంలో నియోజకవర్గ స్థాయి రైతు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా చల్మెడ మాట్లాడుతూ, పంటలకు బోనస్ ఇస్తామని గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి మాట తప్పారని ఆరోపించారు. ఇప్పటికైనా ధాన్యానికి ₹500బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సృష్టించిన కరువుతో వందలాది ఎకరాలు ఎండిపోయాయని, ప్రతి ఎకరానికి ₹25వేల నష్ట పరిహారం అందించాలని, రైతుబంధు ఎకరానికి ₹15వేలు ఇవ్వాలని, ₹2లక్షల రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నిరంతర విద్యుత్, సాగునీరందక పంటలు ఎండిపోయి రైతులు ఆత్మస్థైర్యం కోల్పోయే పరిస్థితి తీసుకువచ్చారని మండిపడ్డారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, ఎంపీపీలు బండ మల్లేశం యాదవ్, చంద్రయ్యగౌడ్, జడ్పీటీసీలు మ్యాకల రవి, నాగం భూమయ్య, సెస్ డైరెక్టర్‌లు రేగుల పాటి హరిచరణ్‌రావు, ఆకుల దేవరాజం, పార్టీ అధ్యక్షులు గోస్కుల రవి, మల్యాల దేవయ్య, మ్యాకల ఎల్లయ్య, కమలాకర్, సత్తి రెడ్డి, కందుల క్రాంతి కుమార్, సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, న్యాలకొండ రాఘవరెడ్డి, కౌన్సిలర్లు మారం కుమార్, నిమ్మశెట్టి విజయ్, నరాల శేఖర్, గోలి మహేశ్, పీఏసీఎస్ చైర్మన్లు బండ నరసయ్య యాదవ్, జలగం కిషన్‌రావు, రామ్మోహన్ రావు, నాయకులు పొలాస నరేందర్, తీగల రవీందర్‌గౌడ్, ప్రభాకర్‌రావు, నేరెళ్ల జ్యోతి, రామతీర్థపు రాజు, కుమ్మరి శ్రీనివాస్, గడ్డం హన్మాండ్లు, ఏశ తిరుపతి, వెంగళ శ్రీకాంత్ గౌడ్, రాజు, చిలక పెంటయ్య, భైరగోని రమేశ్, ఈర్లపల్లి రాజు, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, వాసాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతుదీక్షకు తరలిన నాయకులు

సిరిసిల్ల రూరల్/ముస్తాబాద్/ వీర్నపల్లి, ఏప్రిల్ 6: జిల్లా కేంద్రంలోని తెలంగాణభవన్‌లో చేపట్టిన రైతు దీక్షకు తంగళ్లపల్లి, ముస్తాబాద్, వీర్నపల్లి మండలాల నుంచి బీఆర్ఎస్ నేతలు, రైతులు తరలివెళ్లారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రికేటీఆర్‌తో కలిసి దీక్షలో పాల్గొన్నారు. తంగళ్లపల్లి నుంచి ఎంపీపీ పడిగెల మానస, పార్టీ మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, పీఏసీఎస్ చైర్మన్లు బండి దేవదాస్‌గౌడ్, కోడూరి భాస్కర్‌గౌడ్, వైస్ చైర్మన్ వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీలు కర్కబోయిన కుంటయ్య, ములిగే దుర్గాప్రసాద్, నాయకులు మాట్ల మధు, వేణుగోపాలరావు, ఉమ్మారెడ్డి సత్యనారాయణరెడ్డి, కర్నె బాలయ్య, కురుమ రాజయ్య, కందుకూరి రామాగౌడ్, సద్ద రోజా, కోడం సంధ్యారాణి, పడిగెల రాజు, ప్రసాద్, కొమురయ్య, పుర్మాణి లక్ష్మారెడ్డి, బుస్స లింగం, నక్క రవి, కొమ్మెటి రాజిరెడ్డి, మదన్‌రెడ్డి, ఎల్లంయాదవ్, జగన్, భానుమూర్తి, అనిల్‌గౌడ్, రమేశ్, పర్కపల్లి తిరుపతి హాజరయ్యారు. అలాగే వీర్నపల్లి మండల కేంద్రం నుంచి జడ్పీటీసీ గుగులోత్ కళావతి, ఎంపీపీ మాలోత్ భూల, పార్టీ మండలాధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి, బంజారా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుగులోత్ సురేశ్‌నాయక్, యువజన విభాగం మండలాధ్యక్షుడు సామల్ల దేవరాజు హాజరయ్యారు. ముస్తాబాద్ మండలం నుంచి ఎంపీపీ జనగామ శరత్‌రావు, నాయకులు, రైతుదీక్షకు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

సిరిసిల్ల రూరల్: రైతుదీక్ష వేదిక వద్ద తంగళ్లపల్లి ఎంపీపీ మానస, మండలాధ్యక్షుడు రాజన్న, నాయకులు

ముస్తాబాద్: చిప్పలపల్లి నుంచి రైతు దీక్షకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

తెలంగాణభవన్‌లో నిర్వహించిన రైతు దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్

రైతుల వెంటే రామన్న

- రైతుదీక్షకు హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్
- ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్
- పెద్ద ఎత్తున తరలివచ్చిన పార్టీ శ్రేణులు, రైతులు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్6: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అన్నదాతలకు అండగా నిలిచారు. పార్టీ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన రైతుదీక్షకు పార్టీ శ్రేణులు, రైతులతో కలిసి రామన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, వ్యవసాయ రంగంలో ఇంత సంక్షోభం నెలకొంటుందని బీఆర్ఎస్ ప్రభుత్వం పోయిన నాలుగు నెల్లోనే మాట్లాడుకోవాల్సి వస్తుందని అనుకోలేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ సర్కారు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత బీఆర్ఎస్‌పై ఉందన్నారు. రైతులు అధైర్యపడొద్దన్నారు. ఇక్కడ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాఫ్స్ కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఆర్‌బీఎస్ మాజీ అధ్యక్షులు, పీఏసీఎస్ చైర్మన్లు, తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణభవన్‌లో రైతుదీక్ష కార్యక్రమానికి హాజరైన పార్టీ శ్రేణులు, రైతులు

గర్జించిన నేతన్న

- వస్త్ర పరిశ్రమ సంక్షోభానికి కాంగ్రెస్సే కారణమంటూ మండిపాటు
- విజయవంతమైన 'నేతన్న గర్జన సభ'

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కారుపై నేతన్నలు గర్జించారు. పెండింగ్ బకాయిలు విడుదలచేయక, వస్త్ర ఆర్డర్లు ఇవ్వక పరిశ్రమ సంక్షోభానికి కారణమైందంటూ మండిపడ్డారు. ఆత్మహత్యలకు బాధ్యత వహించాలని హెచ్చరించారు. శనివారం సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వస్త్ర ఉత్పత్తిదారులు, అనుబంధ పరిశ్రమలు, కార్మికులు, కార్మిక సంఘాలతో జేఏసీ నిర్వహించిన నేతన్న గర్జన సభ విజయవంతమైంది. పొలంబాట సందర్భంగా సిరిసిల్లకు వచ్చిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నేతన్నలకు మద్దతు ప్రకటించారు. గర్జన సభలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని చెప్పారు. మాజీ మంత్రి కేటీఆర్ సైతం కార్మికులకు వెన్నంటి ఉంటానని భరోసానిచ్చారు. కార్మిక క్షేత్రం నుంచి తరలివచ్చిన వేలాది మంది కార్మికుల గొంతుకలు ఏకమై సర్కారు తీరును ఎండగట్టాయి. ముఖ్య అతిథులుగా హాజరైన సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య, కార్యదర్శి కూరపాటి రమేశ్ ప్రసంగించారు. పరిశ్రమ సంక్షోభానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణమని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్లే దేశంలోని వస్త్ర పరిశ్రమ కుంటుపడిందని, ఉన్న పథకాలను రద్దు చేసి పన్నులు పెంచి కార్మికులను సంపదను దోచుకుంటుందని విమర్శించారు. గత ప్రభుత్వంపై కోపంతో కార్మికులపై కాంగ్రెస్ కక్షసాధింపులకు పాల్పడుతుందంటూ మండిపడ్డారు. స్వాతంత్రం వచ్చి 70ఏళ్లు అవుతున్నా, దేశానికి అన్నపూర్ణ అని గొప్పగా చెప్పుకుంటున్న ఈరోజుల్లో భిక్షాటన చేసి కార్మికులు ఆకలి తీర్చుకోవడం ఈప్రభుత్వాల ధైర్యాగ్యమేనని ధజమెత్తారు. పని లేక కుటుంబాన్ని పోషించలేక ఆత్మహత్య చేసుకున్న నేత కార్మికుడు సిరిపురం లక్ష్మీనారాయణకు సభ నివాళులర్పించింది. ఆయన కుటుంబానికి సభ ప్రగాఢ సానుభూతిని తెలిపింది. పరిశ్రమ సంక్షోభాన్ని నివారించకుంటే అసెంబ్లీని ముట్టడిస్తామని సభద్వారా నేతన్నలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సభలో సీఐటీయూ, సీపీఐ నాయకులు కోడం రమణ, పంతం రవితో పాటు వస్త్ర వ్యాపారులు మంచె శ్రీనివాస్, మండల సత్యం, తాటిపాముల దామోదర్, వెల్దండి దేవదాస్, గోవిందు రవి, కార్మిక సంఘాల నాయకులు, నేత కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య

సమావేశంలో పాల్గొన్న నేత కార్మికులు

పూజలు చేస్తూ.. ఆశీర్వదిస్తూ

- పలు శుభకార్యాలకు హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్6: తెలంగాణ ఓయూ జేఏసీ నేత దరువు ఎల్లన్న మేనకోడలు సుష్మ-భాస్కర్‌కు గత నెల 27న వివాహం కాగా, నూతన వధూవరులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం ఆశీర్వదించారు. అలాగే బీఆర్ఎస్ యువజన నాయకుడు మైఖేల్ ఇంటికి వెళ్లి కొద్దిసేపు గడిపారు. ఇక్కడ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఓయూ జేఏసీ నాయకుడు మాందాల భాస్కర్, జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, తదితరులు ఉన్నారు.

కల్యాణోత్సవానికి హాజరైన కేటీఆర్

ముస్తాబాద్, ఏప్రిల్ 6: పోతుగల్‌లోని పెద్దమ్మ-పెద్దిరాజుల ఆలయంలో శనివారం కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మండలాధ్యక్షుడు సురేందర్‌రావు, ఎంపీపీ జనగామ శరత్‌రావు, రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ తన్నీరు బాపురావు, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, నాయకులు పూర్ణచందర్‌రావు, వెన్నమనేని శ్రీనివాస్‌రావు, పారిపెల్లి శ్రీనివాస్, ముదిరాజ్ సంఘం నాయకులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

ఎల్లారెడ్డిపేట: సుష్మ-భాస్కర్ దంపతులను ఆశీర్వదిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్

ముస్తాబాద్: పోతుగల్‌లో పెద్దమ్మ-పెద్దిరాజుల కల్యాణోత్సవంలో పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

చులకనగా చూశాడని..

- బండరాయితో కొట్టి చంపిండు
- హత్య కేసులో నిందితుడి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ నాగేంద్రాచారి

పోలీస్‌స్టేషన్‌లో నిందితుడి అరెస్ట్ చూపి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగేంద్రాచారి

వేములవాడ, ఏప్రిల్6: చులకనగా చూశాడని పరిచయం ఉన్న స్నేహితుడే బండరాతితో కర్కశంగా కొట్టి చంపాడు. వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ నాగేంద్రాచారి హత్య కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. వేములవాడ పట్టణంలోని భగవంతరావునగర్‌లో ఈ నెల 2న ముస్తాబాద్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన సిర్రం మహేశ్(46) హత్యకు గురికావడంతో ఘటనా స్థలానికి వెళ్లి పోలీసులు పరిశీలించారు. మహేశ్‌కు 12ఏండ్ల క్రితమే వివాహం కాగా భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుటుంబ కలహాలతో మూడేండ్లుగా వేములవాడలోని శ్రీనివాస్ అనే వ్యక్తికి సంబంధించిన రేకుల షెడ్‌రూంలో అద్దెకు ఉంటున్నాడు. ఈ క్రమంలో మహేశ్‌కు ధర్ర తిరుపతి పరిచయం కాగా, ఇద్దరు ఒకే రూమ్‌లో ఉంటున్నారు. అద్దె కూడా చెల్లించాలని మహేశ్ పలుమార్లు తిరుపతికి చెప్పిన చెల్లించలేదు. పనిచేసే చోట చులకనగా మాట్లాడి అవహేళన చేస్తున్నాడని మనసులో పెట్టుకున్న తిరుపతి, ఈ నెల ఒకటో తేదీన రాత్రి మహేశ్‌కు బాగా మద్యం తాగించాడు. మత్తులో ఉన్న మహేశ్‌ను సిమెంట్ బండరాయితో కొట్టి చంపాడు. ఈ క్రమంలో శనివారం చెక్కపల్లి రహదారిలోని సబ్‌స్టేషన్ వద్ద తిరుపతిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో వేములవాడ పట్టణ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్, ఎస్ఐ అంజయ్య ఉన్నారు.

లెప్రసీ కేసులు ఆన్‌లైన్ చేయాలి

కలెక్టరేట్, ఏప్రిల్ 6: జిల్లాలో నమోదైన లెప్రసీ కేసులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో లెప్రసీ నోడల్ సూపర్‌వైజర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు కుష్టు వ్యాధిగ్రస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే విధానంపై లెప్రసీ ఇండియా ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ఇక్కడ డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు, జిల్లా ప్రోగ్రాం అధికారి డా రజిత, ప్రోగ్రాం అధికారులు డా శ్రీరాములు, డీపీఎంవో కాశీనాథ, శ్రీనివాస్, కూన సురేశ్, రాజ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

తెలంగాణ చౌక్, ఏప్రిల్ 6: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ పేర్కొన్నారు. వారం రోజుల్లో జిల్లాలో జరిగిన సైబర్ నేరాల వివరాలను శనివారం ఆయన వెల్లడించారు. ప్రమేయం లేకుండా మొబైల్‌కు వచ్చే ఓటీపీలను ఎవరికీ షేర్ చేయవద్దని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే హెల్ప్ లైన్ నంబర్ 1930 లేదా డయల్ 100 నంబర్‌కి కాల్ చేయాలని సూచించారు.

రేషన్ బియ్యం పట్టివేత

చందుర్తి, ఏప్రిల్ 6: ఎన్గల్ శివారులో వేములవాడకు చెందిన రమేశ్ తన కారులో శ్రీనివాస్ అనే యజమాని రైస్‌మిల్లుకు తరలిస్తున్న నాలుగు క్వింటాళ్ల బియ్యాన్ని శుక్రవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఆయన వెంట సిబ్బంది, తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల నిర్వహణపై శిక్షణ

సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీవో శేషాద్రి

కలెక్టరేట్, ఏప్రిల్ 6: ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై శనివారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో ఏపీఎంలు, కేంద్రాల ఇన్‌చార్జిలు, బుక్ కీపర్లు, కమిటీ సభ్యులకు డీఆర్డీవో శేషాద్రి శిక్షణ ఇచ్చారు. డీఆర్డీవో కార్యాలయానికి కేటాయించిన 44కేంద్రాల నిర్వహణపై ఆయన సమీక్షించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. ఇక్కడ జిల్లా పౌర సరఫరాల డీఎం జితేంద్రప్రసాద్, అదనపు డీఆర్డీవో జీ శ్రీనివాస్, డీపీఎం పాపారావు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సరిత, కార్యదర్శి రజిత, సివిల్ సప్లై కార్యాలయ సిబ్బంది నాగాచారి, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

అక్రమ వడ్డీ వ్యాపారులపై కొరడా

- జిల్లాలో ఏకకాలంలో దాడులు
- 14 కేసుల నమోదు..
- ₹16.13లక్షలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అఖిల్ మహాజన్

తెలంగాణ చౌక్/వేములవాడ/ ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 6: సామన్య ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకొని అధిక వడ్డీలకు డబ్బులు ఇచ్చి వసూళ్లు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. శనివారం జిల్లా వ్యాప్తంగా ఏకకాలంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా మొత్తం 24టీంలు తనిఖీలు నిర్వహించగా అక్రమంగా వడ్డీ వ్యాపారం, ఫైనాన్స్ నిర్వహిస్తున్న 14మందిపై కేసు నమోదు చేశామన్నారు. ₹16,13,000 నగదు, 359 డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అనుమతులు లేకుండా ఫైనాన్స్ నిర్వహించినా.. అధిక వడ్డీలతో ఇబ్బందులకు గురిచేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అప్పులు తీసుకోవడం.. ఇవ్వడం నేరంకాదని కానీ ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం లైసెన్స్‌తో అప్పు ఇవ్వవచ్చని వివరించారు. అధిక వడ్డీతో సామన్యులపై దౌర్జన్యం చేస్తే డయల్ 100 నంబర్‌కి ఫిర్యాదు చేయాలని సూచించారు.

8న సిరిసిల్లలో 2కే రన్

సిరిసిల్ల, ఏప్రిల్ 6: స్వీప్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఈ నెల 8న 2కే రన్ నిర్వహించనున్నట్లు స్వీప్ నోడల్ అధికారి, అదనపు డీఆర్డీవో గొట్టె శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓటుహక్కు ఉన్నవారందరికీ కలెక్టర్ ఆదేశాల మేరకు స్వీప్ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కాగా సిరిసిల్ల ఏఆర్వో (అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి), అదనపు కలెక్టర్ పూజారి గౌతమి ఆధ్వర్యంలో ఈ నెల 8న ఉదయం 6గంటలకు సిరిసిల్లలోని అంబేద్కర్ విగ్రహం నుంచి బతుకమ్మ ఘాట్ వరకు 2కే రన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. యువత, పట్టణ ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేత కార్మికుడి కుటుంబానికి ఎంపీ పరామర్శ

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 6: మున్సిపల్ పరిధిలోని రాజీవ్‌నగర్‌కు చెందిన నేత కార్మికుడు లక్ష్మీనారాయణ ఆత్మహత్య చేసుకోగా, శనివారం రాత్రి బాధిత కుటుంబాన్ని ఎంపీ బండి సంజయ్‌కుమార్ పరామర్శించారు. లక్ష్మీనారాయణ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు లక్ష రూపాయల నగదు అందజేశారు.

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలి

బోయినపల్లి, ఏప్రిల్ 5: గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక చొరవ చూపాలని జడ్పీసీఈవో ఉమారాణి అధికారులకు సూచించారు. శనివారం మండల పరిషత్‌లో అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. ఆమె వెంట ఎంపీడీవో జయశీల, ఎంపీవో గంగాతిలక్, కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు, ఏఎన్ఎంలు, తదితరులు ఉన్నారు.

రాములోరి కల్యాణం వైభవంగా నిర్వహిస్తాం

వేములవాడ టౌన్, ఏప్రిల్ 6: రాజన్న ఆలయంలో ఈ నెల 17న రాములోరి కల్యాణమహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఆర్డీవో రాజేశ్వర్ పేర్కొన్నారు. రాజన్న ఆలయ అతిథిగృహంలో ఆర్డీవో అధ్యక్షతన శనివారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, ఈ నెల 9న ఉగాది పర్వదినం నుంచి 17వ వరకు శ్రీ రామనవమి నవరాత్రోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో ఆలయ ఈవో కృష్ణప్రసాద్, డీఎస్పీ నాగేంద్రాచారి, అధికారులు పాల్గొన్నారు.

మనోహర్‌రెడ్డి పరామర్శ

వేములవాడ రూరల్, ఏప్రిల్ 6: మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లిలో దాసరి నర్సవ్వ ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నేత ఏనుగు మనోహర్‌రెడ్డి పరామర్శించారు. నర్సవ్వ కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఆయన వెంట మ్యాకల శ్రీనివాస్, గుడిసె పురుషోత్తం, సాగర్, శివ, బాబు, గుడిసె అనిల్ ఉన్నారు.

అందరికీ 'ఉపాధి' కల్పించాలి

చందుర్తి, ఏప్రిల్ 6: అర్హులందరికీ ఉపాధిహామీ పథకం ద్వారా పని కల్పించాలని ఏపీవో అసిస్టెంట్లకు రాజయ్య సూచించారు. రామారావుపల్లిలో ఉపాధిహామీ పనులతోపాటు, కిష్టంపేటలోని నర్సరీని శనివారం ఆయన పరిశీలించారు. ఎండలు ముదిరిన నేపథ్యంలో ఉదయం 6నుంచి 10గంటల వరకు ఉపాధిహామీ పనులు పూర్తి చేయాలన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★Wanted Agents, Associates Franchise throughout Telangana for Abroad Medical College Admission. 8881116865 / 8881115253.
NT-311882-All

WANTED

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-311821-All

PASSPORT LOST

★Guguloth Gangadhar S/o. Ramulu, 5-131, Thukya Thanda, Chinthamani Thanda, Rudrangi Mandal, Rajanna Sircilla Dist. My passport No. X6020003 Lost by Travelling from Rudrangi to Metpally. If any found please call 93912 84906.
NTK-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194